క్లుప్తంగా

బాధ్యతతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి

ధర్మవరం: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించినప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందని హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ హెడ్ హౌసింగ్ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ మునీశ్వర్ నాయుడు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు సుదీర్ఘమైన సేవలు అందించడం గర్వకారణమని తెలిపారు. తోటి ఉద్యోగుల మన్ననలు పొందుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. అనంతరం వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలాజీ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీకాల వివరాలు నమోదు చేయండి



మొబైల్స్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న అధికారులు

ధర్మవరం అర్బన్: ఈ–ఆశా యాప్‌తో ఆరోగ్య పర్యవేక్షణ వేగవంతం అవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్య పర్యవేక్షణ చేసిన ప్రగతిని నమోదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా గర్భవతుల నమోదు, ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాల వివరాలను నమోదు చేయాలని సూచించారు. కుష్టు నివారణకు రోజుకు 25 గృహాలను సందర్శించి శరీరంపై ఉన్న రాగి రంగు మచ్చలు, స్పర్శ లేని మచ్చలను గుర్తించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ లాగిన్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు నివారణ అధికారి తిప్పయ్య నాయక్, పీపీ యూనిట్ ఆఫీసర్లు శ్రావణి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



జ్యూస్ అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

ధర్మవరం అర్బన్: స్థానిక శాంతినగర్‌లోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద శుక్రవారం చౌడేశ్వరి దేవి సేవా సమితి, కౌన్సిలర్ శంకర్ తేజేశ్వర్, తొగటవీర క్షత్రియ సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ యుగంధర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, టూటౌన్ సీఐ రాజా, కాచర్ల అంజి, సిద్ది రాజేష్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన 70 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు కేతా లోకేష్, నీలూరి వెంకటరాముడు, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రామనాథరెడ్డి

ఓడీ చెరువు: ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేపట్టాలని తహసీల్దార్ రామనాథరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఓటరు జాబితాను తీసుకుని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను గుర్తించే ప్రక్రియ చేపట్టాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓటర్లను గుర్తించి ఫారం–7, ఫారం–8లో పొందుపరచాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. అనర్హులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగేంద్ర, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

అమడగూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లను జాబితాలోకి చేర్చాలన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు



నల్లచెరువు: వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న గ్రామస్తులు



కోవెలగుట్టపల్లిలో ఎడ్లబండ్లను తిప్పుతున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: మండలంలో తొలి ఏకాదశి వేడుకలు శుక్రవారం కొనసాగాయి. ఏడాదిలో మొదటి పండుగ కావడంతో ప్రజలు, రైతులు గురువారం ఉపవాస దీక్షలు, శుక్రవారం పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం నిడిమామిడి, కప్పలబండ గ్రామాల్లో పెద్ద ఎత్తున ఎడ్ల బండ్ల ఊరేగింపు, పరుగు పందేలు నిర్వహించారు. యువత ఎడ్ల బండ్లు వెనుక పరుగెడుతూ సందడి చేశారు. ప్రత్యేక డప్పుచప్పుళ్ల మధ్య ఎడ్లబండ్లలో ఆలయాలకు తరలివెళ్లారు. నిడిమామిడిలో నిడిమామిడమ్మ దేవత, కప్పలబండలో పోతులప్ప స్వామి, కోవెలగుట్టపల్లిలో వేంకటేశ్వర స్వామిని ఊరేగించారు. భక్తులకు ప్రసాదం అందజేసిన అనంతరం పరుగు పందేలు నిర్వహించారు. ఈ పందేలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నేడు ఉట్ల పరుష..

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిడిమామిడి, కప్పలబండ, కోవెలగుట్టపల్లి గ్రామాల్లో ఉట్ల పరుష నిర్వహిస్తారు. ఇప్పటికే ఉట్ల మానును సిద్ధం చేశారు. ఈ వేడుకలను చూడడానికి పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేస్తారు. ఈ పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎటువంటి సంఘటనలూ చోటు చేసుకోకుండా పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ దాదాపీర్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

దామవాండ్ల పల్లిలో..

నల్లచెరువు: ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం దామవాండ్ల పల్లిలో వేంకటేశ్వర స్వామిని గ్రామస్తులు ఘనంగా ఊరేగించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఓబులేశ్వరుడి కొండపై ఏకాదశి ఉత్సవాలు

పుట్టపర్తి అర్బన్: ఓబులేశ్వర స్వామికి రెండు రోజుల పాటు నిర్వహించిన ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించిన మహామంగళ హారతితో ముగిశాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పంచలోహాలతో తయారు చేసిన ఆభరణాలతో స్వామిని అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం కొండ కింది భాగంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే గాక కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు ఏకాదశి ఉత్సవాలకు విచ్చేశారు. ఓబులేశ్వరుడి కాపులు ఉపవాస దీక్షలను శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చి విరమించారు. ఏటా లక్షలాది రూపాయలు విరాళాలు వస్తున్నా సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయక పోవడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



ఓబులేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

● రైతు నేస్తాలు వచ్చేశాయ్..



సాధారణంగా కనిపించే ఆకుపచ్చ గొల్లభామ



బంగారు రంగులో ఉన్న గొల్లభామ

పుట్టపర్తి అర్బన్: పంటల సీజన్ మొదలు కాగానే రైతులు, పంటలకు ఉపయోగపడే ఎన్నో రకాల మిత్ర పురుగులు పొలాల్లో సందడి చేస్తాయి. పంటలకు ఆశించే క్రిమి కీటకాలను భక్షిస్తూ రైతులకు అండగా నిలుస్తాయి. పంటలను కాపాడుతున్న గొల్లభామ (ప్రేయింగ్ మ్యాటిస్) సాధారణంగా ఆకుపచ్చ రంగులో కనిపిస్తుంటాయి. ఆకుపచ్చ రంగుతో పాటు బంగారు వర్ణంలో మెరిసి పోతున్న గొల్లభామ పుట్టపర్తి మండలం పెడపల్లిలో శుక్రవారం దర్శనమిచ్చాయి. ఇవి సాధారణంగా కీటకాలు, సాలీడు పురుగులు, కప్పలు, బల్లులను తింటూ పొడవైన ఆరు కాళ్లు, ఉబ్బిన కళ్లు, రెక్కలతో ఉంటాయి. ఈ కీటకాలు మనుషులు, పంటలకు ఎటువంటి హాని చేయవని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

రస్తా సమస్య పరిష్కరించాలని వినతి

ఎన్పీకుంట: ఇంటి రస్తా సమస్యను పరిష్కరించాలంటూ మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామానికి చెందిన జి.ఆదిరెడ్డి శుక్రవారం తహసీల్దార్ నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశాడు. సుమారు 50 సంవత్సరాలుగా తమ ఇంటికి వెళ్లే రస్తాలో ఇదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డప్పరెడ్డి దౌర్జన్యంగా గుంతలు తవ్వి బండలు నాటుతున్నాడని వాపోయాడు. నీ ఇంటికి దారి ఇచ్చేది లేదని, నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ దుర్భాషలాడాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదే రస్తాలో పంచాయతీ పైపులైను, విద్యుత్ స్తంభాలు నాటినట్లు తెలిపారు. ఇంటికి కుళాయి, విద్యుత్ కనెక్షన్ తీసుకున్నామన్నాడు. స్పందించిన తహసీల్దార్ చర్యలు చేపట్టాలని సంబంధిత వీఆర్‌ఓను ఆదేశించారు.

శ్మశాన వాటిక సమస్యకు పరిష్కారం

పుట్టపర్తి అర్బన్: కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలతో శుక్రవారం జగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ నవీన్ కుమార్, ఎస్‌ఐ దాదాపీర్, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. అంటరానితనాన్ని నిషేధించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలను పరిరక్షించడానికి పౌరహక్కుల చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అంటరానితనాన్ని ప్రోత్సహిస్తే 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీల శ్మశాన వాటికకు హద్దులు చూపించి కంచె ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ నరసింహులు, ఏఈ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, వీఆర్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతోనే మున్సిపాలిటీ అభివృద్ధి





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ధర్మవరం అర్బన్: మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులతో పాటు కౌన్సిలర్ల సహకారం అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అందరం కలిసి సుందరీకరణగా తీర్చిదిద్దుదామని సూచించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. 9వ వార్డులో వీధిలైట్లు లేవని దీంతో రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ తెలిపారు. సచివాలయాల్లో డివైజ్‌లు లేక పనులు ముందుకు సాగడం లేదన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ మాట్లాడుతూ.. పోలీస్ క్వార్టర్స్‌లో తాగునీటి సమస్య ఉందన్నారు. వెంటనే పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. కార్యక్రమంలో డీఈ వన్నూరు స్వామి, మేనేజర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సున్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పర్యటన

ఓడీ చెరువు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పర్యటించనున్నారు. నవరత్నాలు, గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటారని పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ ఉన్నతాధి కారులు, ఎంపీడీఓ, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామాలకు వెళ్లి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు అల్లాపల్లి నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఉత్తమ వైద్య సేవలందించాలి



బదిలీపై వెళ్తున్న వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ నజీర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం బదిలీపై వెళుతున్న వైద్యులు జయప్రకాష్ రెడ్డి, ఉమాదేవి, మాధవి, ఇందురేఖను వైద్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మలత, సురేఖ, నివేదిత, వైష్ణవి, కిరణ్, బాలాజీ, ఉదయ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో కుల, మతాల ప్రస్తావన వద్దు





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

కదిరి: కౌన్సిల్‌లో కుల, మతాల ప్రస్తావన వద్దు అని మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరిగింది. పలువురు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ముందుగా అజెండాలోని అంశాలన్నింటికీ కౌన్సిల్ ఆమోదం తెల్పింది. 7వ వార్డులోని కొన్ని సమస్యలను అజెండాలో చేర్చాలని తాను కోరినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదని ఆ వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ కమిషనర్ శ్రీహరిబాబుపై మండిపడ్డారు. కొన్ని వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేయడానికి ముందుకొస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని గత కొన్ని నెలలుగా చెబుతున్నా కమిషనర్ మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదని కౌన్సిలర్లు కళ్యాణ్, రాంప్రసాద్, షబ్బీర్ మండిపడ్డారు. అభివృద్ధి విషయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వార్డులను చిన్నచూపు చూస్తున్నారని కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ చెప్పడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుంటు రాజశేఖర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఈ వ్యాఖ్యలను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సైతం ఎంఎస్ ఫయాజ్ మాటలను తప్పుబట్టారు.

రోడ్డు పనులు చేపట్టడంపై హర్షం

వాణివీధిలో షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఎన్నో ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, చైర్‌పర్సన్, కమిషనర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు ఖర్చు చేసేందుకు నిధులు మంజూరు చేయడంతోనే అక్కడ రోడ్డు పనులు చేయడం సాధ్యమైందని కమిషనర్ అన్నారు. తన వార్డులో కూలడానికి సిద్ధగా ఒక ఇంటిని కూల్చేయకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని కౌన్సిలర్ ఫయాజ్ పేర్కొన్నారు. తన వార్డులో వర్షం నీరు చేరి కుంటను తలపిస్తోందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నీషా పేర్కొన్నారు. అక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కమిషనర్ సమాధానమిచ్చారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



ఎన్పీకుంట: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



ముదిగుబ్బ: ఉపాధ్యాయురాళ్లకు బహుమతులు అందజేసిన దృశ్యం

ఎన్పీకుంట: మండెంవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గంగాధర్ రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ఆంజనేయులు నాయక్, వెంకటరామిరెడ్డి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక బాలికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాళ్లు ఎలిజిబిత్, కౌసల్ జబీన్, మేరీ, జయ, సుజాత తదితరులు వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారు. శుక్రవారం వీరిని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ధర్మవరం రూరల్: వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి శాస్త్రవేత్తలు మల్లీశ్వరి, మాధవి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏలుకుంట్ల పంచాయతీలో పీఎంకెఎస్వై 2.0 వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రోజు రోజుకు వ్యవసాయంలో మార్పులు రావడం సహజమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పద్ధతులను ఉపయోగించినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏపీడీ క్రిష్ణ చైతన్య, జేఈ రవీంద్రారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ ఎం. భాస్కర్, కమిటీ సభ్యులు, సర్పంచ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

కదిరి: జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను కేంద్ర కార్యాలయం శుక్రవారం నియమించింది. కదిరి మున్సిపాలిటీ ఇన్‌చార్జ్‌గా ఆవుల వెంకట నారాయణరెడ్డి, కదిరి రూరల్ మండలానికి లింగాల మధుసూదన్ రెడ్డి, గాండ్లపెంట మండలానికి గజ్జల రవీంద్రారెడ్డి, నల్లచెరువు మండలానికి ఇ.రాజశేఖర్, ఎన్పీకుంట మండలానికి వై.ఆదినారాయణ రెడ్డి, తలుపుల మండలానికి పీవీ రమణ, తనకల్లు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా కె.హేమశేఖర్ రెడ్డిని నియమించింది. తమ నియామకంపై సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డికి జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

తాడిమర్రి: తాడిమర్రిలో గురువారం కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ శుక్రవారం గొర్రెల కాపరి ముసుగు గంగాధర్‌ను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు ఆర్వేటి కాటమయ్య, పిన్నదరి ఎంపీటీసీ చంద్రబాబు, కురుబ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్, జగదీష్, పెదయ్య, సుదర్శన్, నారాయణస్వామి, వెంకటరాముడు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి 'జగనన్న సురక్ష'

తలుపుల/బత్తలపల్లి/ఎన్పీకుంట/కదిరి అర్బన్/తనకల్లు/తాడిమర్రి/నల్లచెరువు/ముదిగుబ్బ/గాండ్లపెంట/పుట్టపర్తి టౌన్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కానుంది. శుక్రవారం ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎన్పీ కుంట మండలంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ రాము, ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. గాండ్లపెంట మండల పరిధిలోని గొడ్డువెలగల సచివాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం పరిధిలో మారాల, అగ్రహారం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా యూత్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, అగ్రిబోర్డు చైర్మన్ వెంకటచౌదరి మాట్లాడారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు సర్వే చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు క్రిష్ణయ్య, రాజు, గోస్వామి, డీలర్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

తలుపుల: మండలంలోని రేషన్ లబ్ధిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.శ్రీధర్ డీలర్లకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సీఎస్ డీటీ మునిస్వామి అధ్యక్షతన డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. నెలకొకసారి నిర్వహించే డీలర్ల సమావేశానికి వారి కుటుంబీకులు కాకుండా డీలర్లు రాలేరా అంటూ డీలర్ల తీరుపై తహసీల్దార్ మండిపడ్డారు. వచ్చే సమావేశానికి డీలర్లు కచ్చితంగా హాజరుకావాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరేపల్లిపేట గ్రామంలో శుక్రవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని గ్రామ సర్పంచ్ చలపతినాయక్ ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి కోరిన విషయం తెలిసిందే. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయించారు.

పాలకమండలి సమావేశం వాయిదా

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పాలక మండలి సమావేశం వాయిదా వేసినట్లు కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో పాలకమండలి సమావేశం జరగాల్సి ఉండగా నిర్వహణకు అవసరమైన 11 మంది సభ్యుల హాజరు లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి డిపోలో 14 సంవత్సరాలుగా సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన మాదన్న అనంతపురం డిపోకు బదిలీ అయ్యారు. అలాగే అనంతపురం డిపోలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎన్.సి శేఖర్ పుట్టపర్తికి బదిలీపై వచ్చారు. శుక్రవారం డిపోలో బదిలీ ఉద్యోగులను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా, జోనల్ సంయుక్త కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, కార్యదర్శి షబ్బీర్, పెద్దన్న, శోభారాణి పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పంటల బీమా అర్హుల జాబితా

తలుపుల/తాడిమర్రి: గతేడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బీమా సొమ్మును మంజూరు చేసిందని ఏఓలు షాదాబ్, రమాదేవి శుక్రవారం తెలిపారు. అర్హుల జాబితాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతుల జాబితాను ఆయా సచివాలయాల్లో నోటీస్ బోర్డుల్లో ఉంచామన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



తొట్టిలో వేస్ట్ ఆయిల్ పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి కుల్లాయప్ప నాయక్

పుట్టపర్తి అర్బన్: మలేరియా, డెంగీ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసీ కుల్లాయప్ప నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంకటగారి పల్లిలో సిబ్బందితో కలిసి పర్యటించారు. వీధుల్లో పర్యటించిన ఆయన పాఠశాల సమీపంలోని పశువుల తొట్టిని పరిశీలించారు. నీళ్లన్నీ పాచి పట్టి దుర్వాసన వస్తుండటంతో స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే దోమలు పెరిగి, రోగాలు రావా అంటూ ప్రశ్నించారు. సిబ్బందితో నీటి తొట్టిని శుభ్రం చేయించారు. వర్షాకాలంలో వీధులు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇకపై ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోమల నియంత్రణకు దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, సీహెచ్‌ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మీనాయక్, సిబ్బంది రమణయ్య, నాగజ్యోతి, నాగలక్ష్మి, చెన్నక్రిష్ణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రూ.7.57 కోట్ల పంటల బీమా విడుదల

బత్తలపల్లి: మండలానికి 2022 ఖరీఫ్ పంటల బీమా కింద వివిధ రకాల పంటలకు రూ.7.57 కోట్లు విడుదలైనట్లు ఏఓ ఓబిరెడ్డి పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 8,860.51 ఎకరాల్లో సాగు చేసిన వివిధ పంటలకు రూ.7,57,25,654 పరిహారం మంజూరైందన్నారు. బత్తాయి పంటకు ఎకరాకు రూ.11,570, మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.4,758, కంది పంటకు ఈదుల ముష్టూరు రెవెన్యూ గ్రామానికి ఎకరాకు రూ.6,796, మాల్యవంతం రెవెన్యూ గ్రామానికి ఎకరాకు రూ.4,433, బత్తలపల్లి రెవెన్యూ గ్రామానికి ఎకరాకు రూ.144 చొప్పున పరిహారం విడుదలైనట్లు తెలిపారు.

కనగానపల్లి: మండలానికి రూ.5.35 కోట్ల బీమా పరిహారం మంజూరైనట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. చీనీ రైతులకు ఎకరానికి రూ.11,210 చొప్పున 3,811 ఎకరాలకు రూ.4.27 కోట్లు, మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.4,757 చొప్పున 8.2 ఎకరాలకు రూ.39,245 విడుదలైందన్నారు. పంట దిగుబడి ఆధారంగా లెక్కించే కంది పంటకు రైతు భరోసా కేంద్రాల వారీగా పరిహారం మంజూరైందన్నారు.

రామగిరి: మండలానికి వాతావరణ బీమా కింద రూ.5.76 కోట్లు మంజూరైనట్లు ఏఓ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లో కంది పంటకు 5,267 ఎకరాలకు రూ.3.76 కోట్లు, చీనీపంట 1,927 ఎకరాలకు రూ.1.92 కోట్లు చొప్పున బీమా మంజూరైనట్లు తెలిపారు.